క్లుప్తంగా

మాస్టర్ అథ్లెటిక్స్‌లో యువకుడి ప్రతిభ



రామచంద్రరావుని అభినందిస్తున్న నిర్వాహకులు

లక్కవరపుకోట : గుంటూరులో గత నెల 28, 29 తేదీల్లో జరిగిన ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన 6వ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో మండలంలోని లచ్చింపేట గ్రామానికి చెందిన చొప్ప రామచంద్రరావు నాలుగు పతకాలు సాధించారు. ఈ పోటీల్లో జిల్లా నుంచి 20 మంది పాల్గొనగా రామచంద్రరావు 100 మీటర్లు, 110 మీటర్ల పరుగు పందెంలో మూడు సిల్వర్ పతకాలు, రిలే ట్రిబుల్ రన్నింగ్‌లో బ్రాంజ్ మెడల్ సాధించారు. రామచంద్రరావును గ్రామస్తులు అభినందించారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

బొండపల్లి: కుష్య శుద్ధ చతుర్థి సందర్భంగా మండలంలోని దేవుపల్లి గ్రామంలో స్వయంగా వెలసిన రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజ లు నిర్వహించారు. అర్చకులు దూసి శ్రీధర్ శర్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పూజల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

రహదారి పనులకు శంకుస్థాపన



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్

దత్తిరాజేరు: మండలంలోని ఇంగిలాపల్లి గ్రామం నుంచి గడబవలస గ్రామానికి ఉపాధి హామీ నిధులు రూ.రెండు కోట్ల 80 లక్షలతో తారు రోడ్డు నిర్మాణానికి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గడబలస గ్రామస్తుల కోరిక మేరకు నిధులు మంజూరు చేయించి నాలుగు కిలోమీటర్ల మేర రోడ్డు వేయిస్తున్నట్టు చెప్పారు. సర్పంచ్‌లు గర్భపు విజయలక్ష్మి, మద్య భారతి, పీఆర్ డీఈ ప్రసాద్, తహసీల్దార్ విజయభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చీపురుపల్లి: మండలంలోని విజయరాంపురం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 63 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. పట్టణానికి చెందిన మానవీయత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం రేగిడిపేటలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గరివిడి లైన్స్ కంటి ఆస్పత్రి సిబ్బంది హాజరై వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో 69 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా అందులో 28 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని వైద్యులు గుర్తించారు. దీంతో వారికి ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించనున్నారు. శిబిరంలో సంస్థ అధ్యక్షుడు బివి.గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

చర్చలు విఫలం

చీపురుపల్లి: మండలంలోని కర్లాం వద్ద ఉన్న వెంకట్రామా పొల్ట్రీ పరిశ్రమ కార్మికులు, యాజమాన్యం మధ్య జరిగిన నూతన వేతన ఒప్పందం చర్చలు విఫలమయ్యాయి. శుక్రవారం ఆర్‌డీఓ జి.సత్యవాణి సమక్షంలో కార్మికులు, యాజమాన్యం మధ్య చర్చలు నిర్వహించారు. ఇప్పటికే కార్మికులు నూతన వేతన ఒప్పందం కోసం నిరవధిక సమ్మె కొనసాగిస్తున్న నేపథ్యంలో ఇటీవల పరిశ్రమ వద్దకు వెళ్లిన ఆర్‌డీఓ సత్యవాణి, డీఎస్పీ రాఘవులు జనవరి 3న చర్చలు నిర్వహించేందుకు నిర్ణయించారు. ఈ మేరకు శుక్రవారం ఆర్‌డీఓ ఎదుట చర్చలు నిర్వహించారు. అయితే నూతన వేతన ఒప్పందంలో రూ.2 వేలు అమలు చేయాలని కార్మికులు డిమాండ్ చేయగా, రూ.300కు మించి ఇవ్వలేమని యాజమాన్యం ప్రతినిధులు తేల్చి చెప్పారు. దీంతో చర్చలు విఫలమవ్వగా ఈ నెల 7న జిల్లా స్థాయి కార్మికశాఖ కార్యాలయంలో మరోసారి చర్చలు నిర్వహించేందుకు అధికారులు నిర్ణయించినట్లు తెలుస్తోంది.

‘అధికార’ గోకులాలు

పాడి ఆవుల కోసం ప్రభుత్వం గోకులాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఆవుల సంఖ్యను బట్టి గోకులాల నిర్మాణానికి అవసరమైన నిధులను 90 శాతం ప్రభుత్వమే భరిస్తుంది. మిగిలిన పది శాతం నిధులు రైతు భరించాలి. ఇంతవరకు బాగానే ఉన్నా... వీటి మంజూరులో అధికార పార్టీ నేతలు చక్రం తిప్పుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో సామాన్య పాడి రైతులు నష్టపోతున్నారు.

- 90 శాతం రాయితీతో షెడ్లు
- సామాన్య రైతులకు అందని ప్రయోజనాలు



పురిటి పెంట గ్రామానికి మంజూరైన గోకులాలు

గజపతినగరం : గ్రామీణ ప్రాంతాల్లో పాడి పశువుల రైతులకు 90 శాతం రాయితీతో గోకులాల షెడ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. రెండు పాడి ఆవుల నుంచి ఎంత ఎక్కువగా ఉంటే వాటి సంఖ్యను బట్టి స్థలం ఉండాలి. అందుకు అనుగుణంగా గోకులాల షెడ్లు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తుంది. రెండు పాడి ఆవులు ఉన్న రైతులకు రూ.1.15లక్షలు, నాలుగు పాడి ఆవుల ఉన్న రైతుకు రూ.1.85లక్షలు, ఆరు పాడి ఆవులు ఉన్న రైతుకు రూ.2.30లక్షలు చొప్పున ప్రభుత్వం మంజూరు చేస్తుంది. అయితే మంజూరు చేసిన దాంట్లో ప్రభుత్వం ఉపాధి పథకం నుంచి 90 శాతం నిధులు చెల్లించనుంది. పాడి రైతు కేవలం పది శాతం మాత్రమే నిధులు చెల్లించాల్సి ఉంటుంది. పాడి రైతులకు సంబంధించి షెడ్లు నిర్మాణాలు మంచివే అయినా అధికార పార్టీ నేతలు ఇందులో జోక్యం చేసుకుని తమ పార్టీ సానుభూతిపారులకే వీటిని మంజూరు చేసేలా చక్రం తిప్పుతున్నట్టు విమర్శలున్నాయి. సంబంధిత అధికారులపై ఒత్తిడి తీసుకురావడంతో వారు చేసేదేమీ లేక అధికార పార్టీకి చెందిన రైతులకు మాత్రమే వీటిని మంజూరు చేస్తున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. గజపతినగరం మండలాన్నే తీసుకుంటే మొత్తం 118 షెడ్లు మంజూరు చేయగా వీటిలో అధిక సంఖ్యలో టీడీపీకి చెందిన వారే ఉన్నారన్న చర్చ నడుస్తోంది.

గ్రామాల వారీగా మంజూరు చేసిన గోకులాల సంఖ్య ఇలా...

గ్రామం	మంజూరైన గోకులాలు
గజపతినగరం	1
కొనిశ	7
మరుపల్లి	5
పాతబగ్గాం	10
పురిటిపెంట	2
రామన్నపేట	9
గంగచోళ్లపెంట	8
కాలంరాజుపేట	13
కెంగువ	2
కొత్తబగ్గాం	8
లింగాలవలస	1
లోగిశ	28
ఎం.గుమడాం	1
ఎం.కొత్తవలస	2
మదుపాడ	9
ముచ్చర్ల	4
తుమికాపల్లి	4
జిన్నాం	4

గ్రీవెన్స్‌లో ఫిర్యాదు

గజపతినగరం మండలం మదుపాడ గ్రామం నుంచి గోకులాల షెడ్లు కోసం నలుగురు రైతులు దరఖాస్తు చేసుకున్నారు. గ్రామసభ పెట్టి ఈ నలుగురు అర్హులని సర్పంచ్ తీర్మానం చేసినా వీరికి అధికారులు గోకులాలు షెడ్లు మంజూరు చేయలేదు. దీంతో గ్రీవెన్స్‌కు వెళ్లారు. అయినా అధికారులు పట్టించుకోలేదు.

– కదుపుట్ల పైడిపునాయుడు, సర్పంచ్, మదుపాడ

దరఖాస్తు చేసినా..



నాలుగు నాలుగు పాడి ఆవులు ఉన్నాయి. పశువుల షెడ్ కోసం దరఖాస్తు చేసుకున్నాను. అర్హుడిగా నన్ను పరిగణించలేదు. నాకు షెడ్ మంజూరు చేయలేదు. అధికారులను దీనిపై అడిగితే తరువాత చూద్దాం అని తప్పించుకుంటున్నారు.

– ఓల్లు ముసలి నాయుడు, మదుపాడ

పశువుల్లేకుండా షెడ్లు మంజూరు చేయలేం..

గజపతినగరం మండలంలో 100మంది రైతులకు పాడి పుశువుల షెడ్లు నిర్మాణానికి ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యానికి మించి 118 మంది వరకు అర్హులుగా గుర్తించి గోకులాలు మంజూరయ్యాయి. దరఖాస్తు చేసి మిగిలిపోయిన వారికి ఎన్ఆర్ఈజీఎస్‌లో నిధులు ఉంటే వాటిని బట్టి త్వరలో ఎంపీడీఓ మంజూరు చేస్తారు.

– చంద్రశేఖర్, ఏడీఏ, వ్యవసాయ శాఖ, గజపతినగరం

పోలీసు జులుంపై న్యాయవాదుల నిరసన



‘పోలీసు జులుం నశించాలి.. న్యాయవాదులను బెదిరించడం మానుకోవాలి...’ అంటూ ఎస్.కోట మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు ఎదుట న్యాయవాదులు శుక్రవారం నిరసన తెలిపారు. అనంతపురం పోలీస్‌స్టేషన్‌లో సివిల్ కేసు పంచాయతీకి అని పిలిచి సీనియర్ న్యాయవాది బీవీ శేషాద్రిని బెదిరించి, భయపెట్టి ఆయన మృతికి కారణమైన ఎస్ఐ, సీఐలను సస్పెండ్ చేసి, న్యాయవాది కుటుంబానికి రూ.5కోట్లు పరిహారం చెల్లించాలని, పోలీసుల దాష్టీకానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. బార్ అసోసియేటషన్ అధ్యక్షుడు జి.సూరిదేముడు, కార్యదర్శి బి.సత్యనారాయణ, కోశాధికారి త్రిమూర్తులు, న్యాయవాదులు ఎస్‌టీవీ దాసు, ఎం.కామేశ్వరరావు, జి.ప్రకాశరావు, బి.రామకృష్ణ, టీవీఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

– శృంగవరపుకోట

క్షేత్ర స్థాయి పరిశీలన



తడిచి, రంగుమారిన ధాన్యాన్ని వెంటనే నూర్పు చేసి రైతు సేవా కేంద్రాల ద్వారా మిల్లుకు తరలించి విక్రయాలు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు రైతులకు సూచించారు. ఎస్.కోట మండలంలోని సంతగవిరమ్మపేట గ్రామంలో శుక్రవారం క్షేత్ర స్థాయి పరిశీలన జరిపారు. గ్రామంలో పంట పొలాల్లో ఇటీవల వర్షాలకు తడిసిన వరిచేను కుప్పలను, అపరాల పైరును పరిశీలించారు. అపరాల పంటలకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించారు. ఏడీ ఎల్.విజయ, వీఏఏ రవి, జేబీఎస్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

– శృంగవరపుకోట

తెగుళ్లపై అవగాహన అవసరం



భైరిపురంలో మినుము, పెసర పంటల సాగుపై సూచనలిస్తున్న నైరా విద్యార్థులు

మెరకముడిదాం: పెసర, మినుము పంటలను సాగు చేస్తున్న రైతులు ఈ పంటలకు ఆశించే తెగుళ్లపై అవగాహన కలిగి ఉండాలని నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులు తెలిపారు. మండలంలోని భైరిపురం గ్రామంలో పని అనుభవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు మౌనిక, శ్రావణి, అనిత, రమాదేవి మినుము, పెసర పంటలు సాగు చేస్తున్న రైతులకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించారు. పంటలపై పచ్చదోమ, తెల్లదోమ, తామర పురుగులు నివారణకు పసుపు, నీలిరంగు జిగురు అట్టలను ఎకరా పంటలో 15 నుంచి 20 వరకూ అమర్చుకోవాలని సూచించారు. తెల్లదోమ ద్వారా వ్యాపించే పల్లాకు తెగులు వంటివి పంటను ఆశించకుండా నివారించుకోవచ్చునన్నారు. ఇలాంటి పద్ధతులను పాటించడంతో పంటలకు పురుగు మందులు వాడకాన్ని తగ్గించుకోవచ్చునన్నారు. రైతులు కెమికల్స్‌తో తయారుచేసే మందుల వాడకాన్ని తగ్గించుకుని ఇలాంటి పద్ధతులపై దృష్టి సారించి ఆరోగ్యకరమైన పంటలను పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు.

9వ తేదీలోగా ఉమా జూట్ మిల్లు తెరవాలి

- కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లోనే మూతపడ్డ రెండు మిల్లులు
- ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గణేష్‌పండా



సంఘ కార్యాలయంలో మాట్లాడుతున్న గణేష్‌పండా, సంఘం నాయకులు

కొత్తవలస : మండలంలోని కోటపాడు రోడ్డులో గల ఉమా జూట్ మిల్లును ఈ నెల 9వ తేదీ నాటికి తెరిచి కార్మికులకు ఉపాధి కల్పించాలని లేదంటే మిల్లు యాజమాన్య ప్రతినిధుల ఇళ్లను ముట్టడిస్తామని ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గణేష్‌పండా అన్నారు. జూట్ మిల్లు సమీపంలో గల సంఘం భవనంలో కార్యవర్గ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మిల్లు మే నెలలో ముడి సరుకు కొరత, మిల్లులో తయారైన సరుకు మార్కెట్‌లో అమ్ముడుపోలేదనే నెపంతో ఎటువంటి ముందస్తు నోటీస్ లేకుండా అర్ధంతరంగా మూసేసిన విషయం తెలిసిందేన్నారు. ఈ మేరకు కార్మికుల ఆందోళనతో ఏసీఎల్, జేసీఎల్ వద్ద చర్చలు తొమ్మిదిసార్లు జరపగా ఒక్క పర్యాయం కూడా యాజమాన్యం హాజరు కాలేదన్నారు. చివరిగా విశాఖపట్నంలో జేసీఎల్ కార్యాలయంలో డిసెంబర్ 4న నిర్వహించిన కన్సోలేషన్ సమావేశానికి మిల్లు మేనేజింగ్ పార్టనర్లు టి.సుబ్బారావు, టి.సప్తగిరిలు హాజరై జనవరి మొదటి వారంలో మిల్లును ఓపెన్ చేసేందుకు కృషి చేస్తామని తెలిపారని గణేష్ చెప్పారు. కాగా యాజమాన్యం ఆ దిశగా కనీసం చర్యలు చెప్పట్లేదని తెలిపారు. యాజమాన్యం ఇచ్చిన గడువులోపు మిల్లును తెరవకపోతే యజమానుల ఇళ్లను ముట్టడిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే కొత్తవలసలో ఉమా జూట్ మిల్లు, నెల్లిమర్ల జూట్ మిల్లులు మూతపడినట్లు గణేష్‌పండా తెలిపారు. కార్మిక సంఘ నాయకులు కె.శ్రీను, కె.ఈశ్వరరావు, ఎస్.గోవింద, ఎస్.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జలజీవన్ పనులకు శంకుస్థాపన



జలజీవన్ మిషన్ పనుల నిర్వహణకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

లక్కవరపుకోట : మండలంలోని భీమాళి గ్రామంలో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.50.60 లక్షలతో నిర్వహించనున్న ఇంటింట కుళాయి పనులకు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి శుక్రవారం శంకుస్థాపన చేశారు. అలాగే రూ.4.94 లక్షలతో కాల్వల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ పనులు నాణ్యతగా వేగంగా నిర్వహించి ప్రజలకు అందించాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సన్యాసిరావు మాట్లాడుతూ గ్రామంలో 540 ఇళ్లు ఉన్నాయని ప్రతీ ఇంటికి కుళాయి వేసి తాటిపూడి తాగునీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీనురాజు, సర్పంచ్ కొయ్యాన కృష్ణ, మాజీ సర్పంచ్ గుల్లిపల్లి రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై సభ్యుల ధ్వజం

- సమస్యలపై స్పందించని అధికారులు
- దేవదాయ శాఖ నిద్దరోతోందా...?



సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

శృంగవరపుకోట: ‘గతంలో కాలనీల్లో కట్టుకున్న ఇళ్లకు ఓటీఎస్‌లో రిజిస్ట్రేషన్లు చేసి హక్కులు కల్పించండి..., దశాబ్దాల కిందట ఐరన్ విద్యుత్ స్తంభాలు బాగా దెబ్బతిన్నాయి... వాటిని మార్చండి, దేవుడి భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి.. కాపాడండి.., రూ.లక్షలు పెట్టి పనులు చేశాం..బిల్లులు ఇప్పించండి..’ ఇలా పలు సమస్యలపై మండల సమావేశంలో సభ్యులు అధికారుల తీరుపై ధ్వజమెత్తారు. అయితే స్పందించిన అధికారులు మా పరిధిలో ఈ అంశాలు లేవు.. వీలుకావు.. నిబంధనలు ఒప్పుకోవు.. చేయలేం, ఇవ్వలేం, చూడలేం .. అంటూ.. సమాధానం చెబుతూ సమస్యలు తీర్చని సమావేశాలుగా మార్చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సోమేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. తిమిడి గ్రామంలో పాఠశాల పక్కనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉందని మార్చాలని ఎంపీటీసీ పదాల ధర్మారావు అడిగితే పంచాయతీ రూ.25లక్షలు కడితే మారుస్తామని ఏఈ బదులిచ్చారు. చుక్కవానిపాలెం గ్రామం మధ్యగా ఉన్న హెచ్‌టీ లైన్ ప్రమాదకరంగా ఉందని, మార్చాలని మరో ఎంపీటీసీ ఎంవీ దుర్గాప్రసాద్ కోరారు. ఇప్పుడు లైన్ మార్చలేమని అధికారి చెప్పారు. శ్మశాన వాటిక ఆక్రమించాలని తొలగించాలని ఎంపీటీసీ బరసో ప్రశ్నించగా రికార్డులు చూస్తామని, మృతి చెందిన వారికి రేషన్ కొనసాగిస్తున్నారని సర్పంచ్‌లు గాలి సన్యాసయ్య, జుత్తాడ సూర్యారావు ప్రశ్నించగా డిలీషన్‌కు అనుమతి లేదని అధికారులు సమాధానాలు చెప్పారు. ప్రభుత్వ భూముల్లో ఉన్న కాలనీలకు ఓటీఎస్‌లో రిజిస్ట్రేషన్ చేసి హక్కులు కల్పించాలని, అర్హులైన పేదల ఇళ్ల స్థలాలకు భూసేకరణ చేయాలని ఎమ్మెల్సీ రఘురాజు కోరగా ప్రభుత్వం నుంచి ఎటువంటి గైడ్‌లైన్స్ లేవని, చూస్తామని తహసీల్దార్ అరుణకుమారి చెప్పారు. దేవదాయ శాఖకు 360 ఎకరాలు ఉంటే 11 ఎకరాలకే శిస్తు కడుతున్నారని, ప్రభుత్వ భూములు రిజిస్ట్రేషన్లు జరిగిపోతున్నాయి, దశాబ్దాలుగా నామమాత్రపు శిస్తు ఎలా అమలు చేస్తున్నారని, బహిరంగ వేలం ఎందుకు పెట్టడం లేదని ఎమ్మెల్సీ రఘురాజు ప్రశ్నించగా ఈఓ నాగేంద్ర నీళ్లు నమలడం తప్ప బదులు చెప్పలేదు. రోడ్లపై తుప్పలు పెరిగి ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్నాయని, ఉపాధి హామీ పథకంలో జంగిల్ క్లియరెన్స్ చేయాలని, గత ప్రభుత్వంలో నిర్మించిన గోకులాలకు బిల్లులు చెల్లించాలని సర్పంచ్ సూర్యారావు కోరగా ఉపాధి ఏపీఓ రమ్య బదులిస్తూ నిబంధనలు అనుమతించవని చెప్పారు. ఇలా సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానాలు దాటేశారు. దీంతో ఇటువంటి సమావేశాలు ఎందుకని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు ఇందుకూరి సుబ్బలక్ష్మి, పినిశెట్టి వెంకటరమణ, ఎంపీడీఓ ఎం.సతీష్, తహసీల్దార్ అరుణకుమారి, ఎస్.కోట ఎస్.ఐ గంగరాజుతో పాటు వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, సభ్యులు పాల్గొన్నారు.

ఏఓగా పట్నాయక్



సుధాకర్ పట్నాయక్

మెరకముడిదాం:ఎంపీడీఓ కార్యాలయం పరిపాలన అధికారిగా సుదర్శన్‌పట్నాయక్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన మెంటాడ మండలంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తూ ఉద్యోగోన్నతిపై ఇక్కడకు పరిపాలన అధికారిగా వచ్చారు. ఈయన స్థానంలో ఇక్కడ ఏఓగా పని చేసిన వడ్డాది రమణమూర్తి జిల్లా డ్వామా కార్యాలయానికి బదిలీపై వెళ్లారు.

పలు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

వేపాడ: పలు గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. మండలంలోని రామస్వామిపేట, పీకేఆర్ పురం గ్రామాల్లో జరిగిన సదస్సుల్లో డిప్యూటీ తహసీల్దార్ సన్యాసినాయుడు పాల్గొన్నారు. 18 అర్జీలు అందినట్టు చెప్పారు. సర్పంచ్ వడ్లమాని శర్మ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే..

బొండపల్లి: రెవెన్యూ సమస్యల పరిష్కారానికే గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ కలెక్టర్ ప్రమీలా గాంధీ పేర్కొన్నారు. మండలంలోని బిల్లలవలస గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో పాల్గొని రైతుల నుండి అర్జీలను స్వీకరించారు. డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వరరావు, పాల్గొన్నారు.

కళ్లేంపూడిలో..

లక్కవరపుకోట : కళ్లేంపూడి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 12 అర్జీలను స్వీకరించినట్లు తహసీల్దార్ డి.ప్రసాదరావు తెలిపారు.

ఆదర్శనీయం సావిత్రిబాయి పూలే



చీపురుపల్లి: ఎంఈఓ కార్యాలయ ఆవరణలో సావిత్రిబాయి పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

నేటి సమాజానికి సావిత్రిబాయి పూలే ఆదర్శనీయమని పలువురు పేర్కొన్నారు. ఆమె జయంతి సందర్భంగా పలు చోట్ల కార్యక్రమాలు నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె సేవలను కొనియాడారు. అధికారులు, ఎంఈఓలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



లక్కవరపుకోట : ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మహిళా ఉపాధ్యాయినిలను సన్మానం



వేపాడ: దబ్బిరాజుపేటలో పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



చీపురుపల్లి రూరల్(గరివిడి): కాపుశంబం ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



దత్తిరాజేరు: సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



కొత్తవలస : తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సావిత్రిబాయిపూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న తహసీల్దార్ నీలకంఠరావు, సిబ్బంది



ఎస్.కోట: ధర్మవరం హైస్కూల్‌లో మహిళా ఉపాధ్యాయినిలకు సన్మానం

ఫలించిన పోరాటం



వేపాడ: ఎంపీడీఓ కార్యాలయం వద్ద సీపీఎం నాయకుడు జగన్, గిరిజనులతో మాట్లాడుతున్న డీఈ సత్యనారాయణ, ఎంపీడీఓ, ఎంపీపీ తదితరులు

వేపాడ: మారిక రహదారి నిర్మాణ పనుల కోసం సీపీఎం ఆధ్వర్యంలో మారిక గిరిజనులు చేపట్టిన రెండు రోజుల వంట వార్పు పోరాటం ఫలించింది. గురు, శుక్రవారాల్లో ఎంపీడీఓ కార్యాలయం వద్ద వంట వార్పుతో సీపీఎం నాయకుడు జగన్ నేతృత్వంలో గిరిజనులు ఆందోళన చేపట్టారు. స్పందించిన అధికారులు పీఆర్ పీఐయూ డీఈ సత్యనారాయణ, ఎంపీడీఓ సూర్యనారాయణ, ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, రూరల్ సీఐ అప్పలనాయుడు, కాంట్రాక్టర్‌తో శుక్రవారం మాట్లాడి రెండు రోజుల్లో పనులు ప్రారంభిస్తామని చెప్పినా గిరిజనులు వెనక్కి తగ్గలేదు. నిధులున్నా.. రోడ్డు నిర్మాణంలో అలసత్వం సరికాదని భీష్మించారు. దీంతో డీఈ కాంట్రాక్టర్‌తో మాట్లాడి జేసీ రప్పించి శుక్రవారం సాయంత్రం మారిక రోడ్డు పనులు ప్రారంభించారు. దీంతో గిరిజనులు తమ ఆందోళనను విరమించారు. పనులు వేగవంతంగా పూర్తి చేయాలని జగన్ అధికారులను కోరారు.